




రావివలస ఎండల మల్లికార్జున స్వామి

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలో ప్రసిద్ధ శైవక్షేత్రాలు ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగంలో శుక్రవారం నుంచి నాలుగు రోజులపాటు వేడుకలు నిర్వహించనున్నారు. అలాగే రావివలసలోని ఎండలమల్లికార్జున స్వామి ఆలయంలో కూడా వేడుకలు జరగనున్నాయి. ఉత్సవాల్లో లక్షలాది మంది భక్తులు పాల్గొని పూజలు చేయనున్నారు. ఈ మేరకు ఆలయ అధికారులు, నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.



శ్రీముఖలింగంలో మధుకేశ్వరస్వామి ప్రధాన ఆలయం

శివరాత్రి ఉత్సవాలకు వేళాయె

- ముక్తికి మార్గం శ్రీముఖలింగం
- రేపటి నుంచి 4 రోజులు వేడుకలు

(జలుమూరు)

శ్రీముఖలింగం.. దక్షిణకాశీగా ప్రఖ్యాతి పొంది భక్తకోటిని పునీతులను చేస్తున్న దివ్య క్షేత్రం. వంశధారనదీ తీరాన వెలసిన స్వామి.. ముఖలింగేశ్వరుడిగా పూజలందుకుంటున్న పుణ్యస్థలం. పరమ శివుడు ముఖాకృతి రూపంలో భక్తులకు దర్శన మిస్తున్న ఏకైక ఆలయం. శ్రీముఖలింగేశ్వరస్వామిని దర్శించుకుంటే ముక్తికి మార్గం దొరుకుతుందని భక్తుల విశ్వాసం. కుమారస్వామి అగస్త్యమహర్షికి ఈ పుణ్యక్షేత్రం కాశీకి తుల్యమైనదిగా అభివర్ణించినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఈ ఆలయం ఆధ్యాత్మిక కేంద్రంగాను విరాజిల్లుతోంది. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 8 నుంచి 11 వరకూ ఉత్సవాలు నిర్వహించనున్నారు. 8న శివరాత్రి జాగరం, 9న పడియా, 10న మహాపడియా, 11న వంశధార నదిలో స్వామి చక్రతీర్థ స్నానం నిర్వహించనున్నారు. ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారు. ఈ మేరకు దేవదాయశాఖ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు.

- శ్రీకాకుళానికి 50 కి.మీ దూరంలో జలుమూరు మండలం వంశధారనది ఒడ్డున శ్రీముఖలింగం వెలిసింది. శ్రీముఖలింగం అనగా.. పరమేశ్వరుని ముఖం లింగంలో కనిపించడం. ఇది దక్షిణకాశీగా కూడా ప్రసిద్ధి చెందిన పురాతన క్షేత్రం. కాశీలో లింగం, గంగలో స్నానం, శ్రీశైలంలో శిఖరం, శ్రీముఖలింగంలో ముఖదర్శనం చేస్తే మోక్షం సిద్ధిస్తుందని శాసనాలు చెబుతున్నాయి. క్రీ.శ.720 నుంచి 1,450 వరకు గంగవంశీకులైన ఒకటవ కామార్ణవునితో ఈ ఆలయం నిర్మాణం ప్రారంభమైనట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. క్రీ.శ.14వ శతాబ్దంలో శిథిలమైన ఈ ఆలయాన్ని పర్లాకిమిడి ప్రభువు శ్రీవిష్ణువర్ధన మధుకర్ణ గజపతి పునరుద్ధరించారు. ఆలయ వాస్తు శిల్పంలో గంగ, చాళుక్య శిల్పకళ మనకు దర్శనమిస్తుంది. ఆలయంపై అద్భుత శిల్పాలు ఉన్నాయి. శ్రీముఖలింగంలో మూడుచోట్ల ముక్కోణం ఆకారంలో ఆలయాలు వున్నాయి. వాటిలో ప్రధాన ఆలయం మధుకేశ్వరాలయం. దీనికి అభిముఖంగా కొంతదూరంలో భీమేశ్వర ఆలయం ఉంది. ఈ రెండు ఆలయాలకు కాస్తదూరంగా ఊరి ప్రారంభంలో ఆధునాతన వాస్తు పద్ధతిలో అద్భుత సోయగాలు కురిపిస్తూ సోమేశ్వరాలయం సందర్శకులకు ఆహ్వానం పలుకుతుంది.

చక్రతీర్థ స్నానాలకు దారేదీ?

ఏటా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా వంశధార నదిలో శ్రీముఖ లింగేశ్వరుడికి చక్రతీర్థ స్నానాలు నిర్వహిస్తారు. లక్ష మందికిపైగా భక్తులు హాజరై.. నదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. కాగా.. చక్రతీర్థస్నానాలకు స్వామి ఉత్సవ మూర్తులను నంది వాహనంపై తీసుకెళ్లడానికి సరైన రహదారి లేకపోవడం విచారకరం. ఏటా శివరాత్రి ఉత్సవాలు వచ్చినపుడు మాత్రమే అధికారులు స్పందించి.. తర్వాత మరిచిపోవడం సాధారణమై పోయింది. శ్రీముఖలింగేశ్వరాలయం నుంచి 4 కిలోమీటర్ల మేర నడిచి.. స్వామిని చక్రతీర్థ స్నానాలకు తీసుకెళ్లాలి. గ్రామం శివారు వరకు రహదారి ఉన్నా.. అక్కడి నుంచి వంశధార కరకట్టలు వరకు పొలాలు మీదుగా వెళ్లాలి. కిలోమీటరు పొడవునా రహదారి ఏర్పాటు చేస్తామని ఏటా అధికారులు ప్రకటనలే తప్ప ఆచరణకు నోచుకోవడం లేదు. దీంతో భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. అటు రైతులకు నష్టం తప్పడం లేదు. ఉత్సవం సమయంలో.. పొలాల్లో ఉన్న జొన్న పంటను తీసి రహదారి ఏర్పాటు చేయాల్సిన దుస్థితి దాపురిస్తోంది. శ్రీముఖలింగేశ్వరాలయం నుంచి స్వామిని చక్రతీర్థ స్నానాలకు ఊరేగింపుగా తీసుకెళ్లేందుకు మార్గం ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆలయం నుంచి ఉత్తర దిశగా స్వామిని ఊరేగింపుగా గ్రామం శివారు వరకు తీసుకెళ్లి.. ఒరియా వీధి కాలనీ నుంచి వంశధార కరకట్టలు వరకు దేవుని భూములే ఉన్నాయి. అయినప్పటికీ ఆ భూమిలో రహదారి ఏర్పాటుకు అధికారులు ఎందుకు చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా దేవదాయశాఖ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేసి ఒరియావీధి కాలనీ నుంచి దేవుని భూమిలో అరకిలోమీటరు పొడవునా రహదారి ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారం చూపాలని భక్తులు కోరుతున్నారు.



ఈ జొన్నపంట మధ్యే.. చక్రతీర్థ స్నానాలకు దారి

రావివలస చేరుకునేందుకు..

టెక్కలికి ఐదు కిలోమీటర్లు దూరంలో ఉన్న రావివలస చేరుకునేందుకు బస్సులు, ఆటోలు సౌకర్యం కలదు. నౌపడా రైల్వేస్టేషన్ నుంచి, టెక్కలి రైల్వేస్టేషన్ నుంచి కూడా రావివలసకు చేరుకోవచ్చు. జిల్లా కేంద్రానికి 55 కిలోమీటర్లు దూరంలో రావివలస కలదు.

ఎండలమల్లన్న సన్నిధిలో..

(టెక్కలి)

ఎండల మల్లికార్జునస్వామి ఆలయం.. భారతదేశంలోనే అతిపెద్ద సహజ శివలింగం గల శైవక్షేత్రం. ఏటా మహాశివరాత్రి పర్వదినాన టెక్కలి మండలం రావివలసలోని ఎండలమల్లన్నను వేలల్లో భక్తులు దర్శించుకోనున్నారు. ఆంధ్రా, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున తరలివస్తారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 8న మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, అర్ధరాత్రి 12గంటలకు లింగోద్భవ కార్యక్రమం నిర్వహిస్తారు. 9న నిత్య అర్చన, అభిషేకాలు, 10న విభూది అభిషేకం, అలంకరణ, నిత్య అర్చనలు, 11న తిరువీధి, సీతకోనేరులో చక్రతీర్థ స్నానాలకు ఏర్పా ట్లు చేశారు. సబ్‌కలెక్టర్ నూరుల్‌కుమార్ ఇప్పటికే దేవాదాయశాఖ యంత్రాంగం, పోలీస్, వైద్యశాఖలు, పంచాయతీ యంత్రాంగం, ఆలయకమిటీ ఛైర్మన్, నిర్వాహకులతో సమావేశమై ఉత్సవాలు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఈవో వాకచర్ల రాధాకృష్ణ, ఆలయకమిటీ ఛైర్మన్ సర్లాన సుధాకర్, సర్పంచ్ బాలకృష్ణ, ఎంపీటీసీ మస్నేల కిషోర్ ఉత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

- భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని రావివలస గ్రామం నుంచి ఎండలమల్లన్న ఆలయానికి చేరుకునేందుకు రాకపోకలకు రెండు మార్గాలు ఏర్పాటు చేశారు. రావివలస హైస్కూల్ ప్రాంగణం వద్ద పోలీసులు కార్లు, ద్విచక్రవాహనాల పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. దామోదరపురం, డీజీపురం మార్గాల నుంచి వచ్చే భక్తుల వాహనాలు లోపలకు రాకుండా చర్యలు చేపట్టనున్నారు.

ఉత్సవ ఏర్పాట్లు పరిశీలించిన ఏసీ

ఉత్సవాల ఏర్పాట్లను దేవదాయశాఖ ఏసీ బీఆర్‌వీవీ ప్రసాద్ పట్నాయక్ బుధవారం పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు, తాగునీటి సదు పాయం, సీతకోనేరు వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. భక్తుల రాకపోకలకు సంబం ధించిన మార్గాలు, సాంస్కృతిక కార్యక్రమాలకుపై ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో ఆరోగ్యశాఖ సిబ్బంది, పోలీసుల బందోబస్తు, పారిశుధ్య పనులకు సంబంధించి దిశా నిర్దేశం చేశారు. ఆయనతో పాటు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌బాబు, ఈవో వాకచర్ల రాధాకృష్ణ, ఆలయ కమిటీ ఛైర్మన్ సుధాకర్, అర్చకులు పాల్గొన్నారు.



రావివలసలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీ ప్రసాద్ పట్నాయక్

బియ్యం అక్రమ రవాణా

- అడ్డుకున్న జీఎస్టీ అధికారులు

నరసన్నపేట, మార్చి 6: నరసన్నపేటలో బియ్యం అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. 25 కేజీల ప్యాకె ట్లను బిల్లుల్లో 26కేజీలుగా చూపుతూ మిల్లర్లు, వ్యాపా రులు విక్రయిస్తున్నారు. అటు పన్నుల రూపంలో ప్రభుత్వానికి ఎగనామం పెడుతున్నారు. ఇటు వినియోగదారులను దోచుకుంటున్నారు. జీఎస్టీ అధికారుల తనిఖీల్లో బియ్యం అక్రమ దందా బయటపడింది. బొరిగివలసలో టి. షణ్ముఖరావుకు చెందిన శ్రీ సాయి శాంతామణి మిల్లు నుంచి సారవకోటకు బొలారోలో 121 బియ్యం ప్యాకెట్లు (25కేజీలు చొప్పున) తరలిస్తున్నారు. బుధవారం కాశీబుగ్గ జీఎస్టీ అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి జమ్ము జంక్షన్ వద్ద ఈ వాహనాన్ని తనిఖీ చేశారు. ఎటువంటి బిల్లులు లేకుండా, 25కేజీలు లేబుల్ ఉన్న ప్యాకెట్లతో బియ్యాన్ని తరలిస్తున్నట్టు గుర్తించారు. జీఎస్టీ అధికారులు బిల్లుల కోసం డ్రైవర్‌ను అడగా.. ఓనర్ ఇవ్వలేదని సమాధానమిచ్చారు. అధికారులు మరింత పట్టుబట్టగా.. 26 కేజీలు ప్యాకెట్లు తరలిస్తున్నట్టు అప్పటికప్పుడు బిల్లులను తయారీ చేసి.. వాట్సాప్ ద్వారా చూపించారు. ప్రభుత్వ నిబంధన మేరకు 25కేజీలు దాటిన బియ్యం బస్తాలకు ఎటువంటి పన్ను లేదు. ఇదే అదునుగా బిల్లుల్లో 26 కేజీలు చూపిస్తూ.. 25 కేజీల కంటే తక్కువ బియ్యాన్ని బస్తాల్లో ప్యాకింగ్ వ్యాపారులు అక్రమ దందా సాగిస్తున్నట్టు అధికారులు గుర్తించారు. దీంతో రైస్‌మిల్లు యాజమానికి నోటీసులు జారీ చేశామని కాశీబుగ్గ రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ వెంకటపద్మ తెలిపారు. పన్నుతో పాటు పది రెట్లు అపరాధ రుసుం చెల్లిస్తే సరుకు అందజేస్తామన్నారు.



జమ్ము జంక్షన్ వద్ద జీఎస్టీ అధికారులకు పట్టుబడిన బియ్యం

అందరు మిల్లర్లూ.. ఇదేతీరు

నరసన్నపేటలో మిల్లర్లు అంతా ఇంచుమించు ఇదేరీతిలో వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. వివిధ రకాల కంపెనీలకు చెందిన బియ్యంగా కవర్లను తయారుచేసి వాటిమీద మిల్లుపేరు లేకుండా ఎక్కడో అడ్రస్‌ను ముద్రించి.. ప్యాకెట్లు విక్రయిస్తున్నారు. మరికొందరు పేరున్న కంపెనీల బ్యాగ్‌లలో ప్యాకింగ్ చేసి వ్యాపారాలు సాగిస్తున్నారు. కొందరు మిల్లర్లు సన్నబియ్యాన్ని అందమైన సంచులలో ప్యాకింగ్ చేసి.. లోపల ముదుగు రకం బియ్యాన్ని కల్తీ చేసి విక్రయిస్తున్నారు. బొరిగివలస, మడపాం కేంద్రంగా పీడీఎస్ రైస్‌ను కూడా ప్యాకింగ్ చేసి విక్రయాలు చేస్తున్నారు. జీఎస్టీ అధికారులు, విజిలెన్స్ అండ్‌ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహిస్తే బియ్యం వ్యాపారుల అక్రమాలు మరింత బయటపడే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



మాట్లాడుతున్న కూన రవికుమార్

జగన్‌రెడ్డికి బీసీలే బుద్ధి చెప్పాలి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవి

అరసవల్లి, మార్చి 6: బీసీలే వెన్నెముక అని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి ఇప్పుడు వారి వెన్నెముకను విరిచేశారని, అలాంటి వ్యక్తికి వచ్చే ఎన్నికల్లో బీసీలే బుద్ధి చెప్పాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీలకు గత టీడీపీ హయాంలో రూ.75వేల కోట్లు కేటాయిస్తే, వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ నిధులను దారి మళ్లించడం నిజం కాదా? అని ప్రశ్నించారు. మంత్రి ధర్మాన మాయమాటలు మానేసి.. ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 'తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీలకు 34 శాతం పదవులను కేటాయిస్తాం. వచ్చే ఐదేళ్లలో బీసీల కోసం రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేస్తాం. ఈ విషయాలను బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించాం. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో బీసీలకు 38 సంక్షేమ పథకాలు అమలు చేశాం. 75 నియోజకవర్గాల్లో పేద బీసీ విద్యార్థుల చదువు కోసం జ్యోతిరావు పూలే స్కూళ్ల ఏర్పాటుకు రూ.25కోట్ల చొప్పున నిధులు కేటాయించాం. 50ఏళ్ల దాటిన మత్స్యకారులు, చేనేత, గీత కార్మికులకు పింఛన్లు ఇచ్చాం. వాటిని వైసీపీ ప్రభుత్వ రద్దు చేయడం నిజం కాదా?. 56 కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా.. వాటికి రూపాయి అయినా కేటా యించిందా?. ఇది బీసీలకు వైసీపీ ప్రభుత్వం చేసిన ద్రోహం కాదా? దీనికి మంత్రి ధర్మాన సమాధానం చెప్పాలి. మీకు బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక 50ఏళ్లు దాటిన బీసీలకు నెలకు రూ.4వేలు పింఛన్‌గా చెల్లిస్తాం. వారి రక్షణకు కొత్త చట్టం తీసుకువస్తాం. జయహో బీసీ సభను చూసిన వైసీపీ నాయకులకు వెన్నులో వణుకు మొదలైంది.' అని రవికుమార్ అన్నారు. సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు, రాష్ట్ర రైతుసంఘం ప్రధాన కార్యదర్శి సింతు సుధాకర్, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్వీ రమణ మాదిగ, రాష్ట్ర తెలుకల సాధికార సమితి డైరెక్టర్ కొమ్మనాపల్లి వెంకటరామరాజు, ఐటీడీపీ అధ్యక్షుడు ప్రధాన విజయరాం పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి

- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

అరసవల్లి, మార్చి 6: ఎన్నికల నిర్వహణలో సెక్టోరియల్ అధికారులు బాధ్యతగా పనిచేయాలని, ఎన్నికల కమిషన్ సూచనలు తప్పకుండా పాటించాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. బుధవారం జడ్పీ సమావేశ మందిరంలో సెక్టోరియల్ అధికారులు, పోలీస్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు తమ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలు, రూట్లపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎస్పీ జీఆర్.రాధిక మాట్లాడుతూ.. సమస్యాత్మక, సంక్లిష్ట పోలింగ్ కేం ద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పోలీసులు సెక్టార్ అధికారులతో కలిసి ప్రతీ గ్రామాన్ని సందర్శించాలని సూచించారు. జేసీ ఎం.నవీన్ మాట్లాడుతూ.. సెక్టోరియల్ అధికారులు పోలింగ్ రోజున అన్ని పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన రిపోర్టులను ఎన్నికల కంట్రోల్ రూమ్‌కు అందజేయాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సహాయ కలెక్టర్ రాఘవేంద్ర, డీఆర్వో ఎం.గణపతిరావు, నోడల్ అధికారి బాలాజీనాయుడు, మాస్టర్ ట్రైనర్ శేషగిరి, డీఎస్పీ త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల్లో ముగ్గురు మాల్ ప్రాక్టీస్

గుజరాతీపేట, మార్చి 6: ఇంటర్మీడియట్ ఫస్టియర్ పరీక్షల్లో బుధవారం ముగ్గురు విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ స్క్వాడ్‌కు పట్టుబడ్డారు. పాతట్నంలో ఒకరు, నౌపడ జూనియర్ కళాశాలలో ఇద్దరు విద్యార్థులు చిక్కారు. జిల్లాలో 83 కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు జనరల్ స్టడీస్‌లో 22,158 మంది విద్యార్థులకు గానూ 21,236 మంది హాజరుకాగా 920మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సులో 1,391 మందికిగానూ 1269 మంది హాజరుకాగా, 121 మంది గైర్హాజరయ్యారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

మందస, మార్చి 6: మందసలోని వాసుదేవుని ఆలయంలో బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. గతనెల 28 నుంచి ఈ బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. చివరి రోజు శ్రీదేవి, భూదేవి సమేత వాసుదేవునికి భక్తుల సమక్షంలో క్షీరాభిషేకం నిర్వహించారు. సుప్రభాతసేవతో ప్రారంభమైన పూజలు ప్రాతఃకాల ఆరాధన, నివేదన, గోష్ఠి, యాగశాలలో ధ్వజారోహణ, విశేష పూజలు చేశారు. త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి ఆలయ ప్రాంగణంలో తీర్థగోష్ఠి నిర్వహించారు. వాసుదేవుడిని పూజించి జీవితం తరించేలా చేసుకోవాలన్నారు. శ్రీరాముడి జీవిత చరిత్రను భక్తులకు వివరించారు.



వాసుదేవునికి అభిషేకం

ధాన్యం నగదు చెల్లింపులకు బయోమెట్రిక్ మెలిక

- జిల్లాలో రూ.143 కోట్ల బకాయిలు
- 40 రోజులుగా రైతుల ఎదురుచూపు

(టెక్కలి)

ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతు భరోసా కేంద్రాల్లో ఎఫ్‌టీవోలు జనరేట్ చేసి 40 రోజులు కావస్తున్నా నేటికీ రైతు ఖాతాల్లో నగదు జమకాని పరిస్థితి. తాజాగా ధాన్యం నగదు చెల్లింపులకు బయోమెట్రిక్ లింక్ చేయాలని గ్రామీణ వ్యవసాయ సహాయకులు చెబుతుండడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. జిల్లాలో 97,551మంది రైతులకు సంబంధించి 1,52,959 ఎఫ్‌టీవోలు జనరేట్ చేసి 4,44,251.04 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. సుమారు లక్షా20వేల మంది రైతులకుగాను ఎఫ్ టీవోలకు సంబంధించి బయోమెట్రిక్ వేయాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు జిల్లాలో రైతులకు ధాన్యం బకాయిలు రూ.143కోట్లు మేర ఉన్నాయి. వాస్తవానికి రైతుభరోసా కేంద్రాల్లో గ్రామీణ వ్యవసాయశాఖ సిబ్బంది ఎఫ్‌టీవోలు జనరేట్ చేసిన 21 రోజుల్లో రైతుఖాతాల్లో డబ్బులు జమకావాలి. నెలలు గడుస్తున్నా తమ ఖాతాల్లో నగదు జమ కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా క్షేత్రస్థాయిలో గ్రామీణ వ్యవసాయ సహాయకులు మరోసారి రైతులకు బయోమెట్రిక్ వేయాలని కోరుతున్నారు. ధాన్యం డబ్బులతోపాటు గోనెసంచులు, హమాలీ ఖర్చులు, రవాణా ఖర్చులు కూడా రైతుల ఖాతా ల్లో జమవుతాయని చెబుతున్నారు. కొంతమంది రైతులు అందుబాటులో లేకపోవడంతో బయోమెట్రిక్ ప్రక్రియ సక్రమంగా సాగడం లేదు.

- ఈ విషయమై పౌరసరఫరాలశాఖ డీఎం శ్రీనివాస్ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా రైతులకు ధాన్యం బకాయిలు రూ.143కోట్లు త్వరలో చెల్లిస్తామన్నారు. బయోమెట్రిక్‌కు, దానికి సంబంధం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి సబ్సిడీ రావాల్సి ఉన్నందున బయోమెట్రిక్ క్షేత్ర స్థాయిలో వేయిస్తున్నారని తెలిపారు.



నర్శింగపలిలో ధాన్యం కొనుగోలు (ఫైల్)



జయహో.. బీసీ

- చంద్రబాబు, పవన్, లోకేశ్ చిత్రపటాలకు పాలభిషేకం

జయహో బీసీ సభ వేదికగా.. టీడీపీ విడుదల చేసిన బీసీ డిక్లరేషన్‌కు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోంది. ఈ నేపథ్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు జయహో బీసీ అంటూ సంబరాలు చేసుకుంటున్నారు. బుధవారం సాయంత్రం శ్రీకాకుళం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుండ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, లోకేష్ చిత్రపటాలకు పాలభిషేకం నిర్వహించారు. దశాబ్దాల తరబడిగా బీసీలకు ప్రాధాన్యం లేదని... తెలుగుదేశం పార్టీలోనే బీసీలందరికీ గుర్తింపు లభించిందని ఈ సందర్భంగా లక్ష్మీదేవి కొనియాడారు.

- శ్రీకాకుళం,ఆంధ్రజ్యోతి

బాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు

బాబుతోనే భవిష్యత్ సాధ్యమని పలువురు నేతలు అన్నారు. బుధవారం వివిధ గ్రామాల్లో బాబు ష్యూరిటీ, సూపర్ సిక్స్ పథకాలపై విస్తృతంగా అవగాహన కలిగించారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతో పాటు టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పాటుకు సహకరించాలని కోరారు.



సోంపేట: పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అశోక్

మహిళల అభ్యున్నతికి టీడీపీ కృషి: ఎమ్మెల్యే

సోంపేట, మార్చి 5: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. ఈ మేరకు బుధవారం సోంపేట పట్టణంలో ఆయన ప్రచారాన్ని ప్రారంభించారు. తొలుత నూకాలమ్మ కొండపై ఉన్న అమ్మవారిని దర్శనం చేసుకొని డాబా కాలనీలో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వైసీపీ ప్రభుత్వ అవినీతి, అక్రమాలను ప్రజలకు వివరించారు. మహిళల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమన్నారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర కార్యదర్శి సూరాడ చంద్రమోహన్, పార్టీ మండల అధ్యక్షుడు మద్దిల నాగేష్, నాయకులు చిత్రాడ శ్రీనివాసరావు, బొడ్డ రాంకుమార్, ఊట్ల మోహన్ గాంధీ, దూసి మధు తదితరులు ఉన్నారు. ● **సంతబొమ్మాళి:** టీడీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న అన్నారు. బుధవారం ఆర్.మరువాడలో టీడీపీ అమలు చేయనున్న సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. టీడీపీ హయాంలోనే ఈ ప్రాంతాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. కార్యక్రమంలో నాయకులు సూరాడ దాసురాజు, సూరాడ ధనరాజ్, తెలుగుయువత మండల అధ్యక్షుడు కూశెట్టి భాను ప్రకాష్ ఐటీడీపీ అధ్యక్షుడు బెండి అరుణ్‌కుమార్, వజ్జ ప్రభాకర్, దుపాన రమణారెడ్డి పాల్గొన్నారు. ● **టెక్కలి:** టీడీపీతోనే ప్రజలకు భవిష్యత్ అని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి అన్నారు. బుధవారం గూడేం పంచాయతీ సన్యాసినీలాపురం, సవరకిల్లి గ్రామాల్లో బాబు సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.● **జలుమూరు:** టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాలకు మేలు చేకూరుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ అన్నారు. బుధవారం బుడితి గ్రామంలో బుధవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వ హించారు. టీడీపీ, జనసేన నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమానికి స్వచ్ఛందంగా ప్రజలు రావడంతో వైసీపీ నాయకుల్లో వణుకుపుట్టిం దన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమం లో నాయకులు ముద్ద భీమారావు, చల్ల ఆనందరావు, డి.జయరాం, వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు. ● **జి.సిగడాం:** టీడీపీ అధినేత చంద్రబాబుతోనే స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణం సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కుమరాపు రవి కుమార్, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కూనుబిల్లి కూర్మారావు అన్నారు. బుధవారం పెంట, బాతువ, డీఆర్ వలస, దవళపేట తదితర గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు కంచరాన సూరన్నాయుడు, మీసాల విజయమ్మ, కోనారి సత్యనారాయణ, సిరిపురపు ఉపేంద్ర, కోరాస సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.● **సరుబుజ్జిలి:** మూలసవలాపురం గ్రామ పంచాయతీ వ్యాసులపేట గ్రామంలో టీడీపీ జిల్లా అధికారప్రతినిధి కూన సంజీవరావు ఆధ్వర్యంలో బుధవారం సూపర్ సిక్స్ శంఖారావం కార్యక్రమాన్ని టీడీపీ శ్రేణులతో బుధవారం కలిసి నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీలను గెలిపించాలని కోరారు.



సంతబొమ్మాళి: ఆర్.మరువాడలో 'సూపర్‌సిక్స్'పై అవగాహన కల్పిస్తున్న టీడీపీ నాయకులు



జలుమూరు: బుడితి, టెక్కలి: గూడెం, జి.సిగడాం: పెంట, సరుబుజ్జిలి: మూల సవలాపురం గ్రామాల్లో సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

బీసీల కోసం ఆవిర్భవించిందే టీడీపీ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట: వెనుక బడిన తరగతుల శ్వాస, ధ్యాస నుంచి ఆవిర్భవించిందే తెలుగు దేశం పార్టీ అని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ ఆవిర్భావం నుంచి నేటి వరకూ బీసీలకు వెన్ను దన్నుగా ఉందని తెలిపారు. మంగళగిరిలో జరిగిన టీడీపీ-జనసేన పార్టీల బీసీ డిక్లరేషన్ సభలో బీసీలపై ఉన్న చిత్తశుద్ధిని చంద్రబాబు, పవన్ ప్రకటించడాన్ని గుర్తించాలన్నారు. ఆర్థికంగా, సామాజికంగా, విద్యపరంగా బీసీలకు టీడీపీ అండగా ఉంటుందన్నారు. బీసీ ఓట్లతో అధికారంలోకి వచ్చిన సీఎం జగన్మోహన్‌రెడ్డి వారిపైనే దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు. కార్పొరేషన్‌ను రద్దు చేసి బీసీలకు అన్యాయం చేసింది వైసీపీ అని మండిపడ్డారు. ఈ సమావేశంలో నాయకులు జల్లు చంద్రమౌళి, శిమ్మ చంద్రశేఖర్, గొద్దు చిట్టిబాబు, కింజరాపు రామారావు, బగ్గు గోవిందరావు, పూతి రమణ, భైరి భాస్కరరావు, బోయన సతీష్, బెవర రాము, శివ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి



మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు శేషగిరి

టెక్కలి: బీసీల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. టీడీపీ-జనసేన కూటమి బీసీ డిక్లరేషన్ ప్రకటించడం హర్షణీయమన్నారు. బీసీలకు 50 సంవత్సరాలకే పెన్షన్ అమలు, పెన్షన్ నెలకు రూ.4 వేలు, చంద్రన్న బీమా రూ.10 లక్షలతో పునరుద్ధరిస్తా మనడంపై హర్షం వ్యక్తంచేశారు. బీసీ సబ్‌ప్లాన్ ద్వారా వచ్చే ఐదేళ్లలో లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తామని, చట్ట సభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ల కోసం తీర్మానం చేసి కేంద్రానికి నివేదిక పంపిస్తామని చెప్పారు.

టీడీపీ వాణిజ్య విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీగా జగన్మోహన్



ఎల్.ఎన్.పేట/హిరమండలం: మండలంలోని శ్యామలాపురం ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన గేదెల జగన్మోహన్‌రావును టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీగా అధిష్ఠానం నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి అంకిత భావంతో పని చేస్తానని, పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. తనను ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమించేందుకు కృషి చేసిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చె న్నాయుడు, ఎంపీ కె.రామ్మోహన్‌నాయుడు, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ మూర్తికి కృతజ్ఞతలు తెలిపారు.

శిరీషపై విష ప్రచారం తగదు



పలాస: టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషపై పలాసలో కొందరు వ్యక్తులు మీడియా ముసుగులో విష ప్రచారం చేయడం తగదని ఆ పార్టీ అధికార ప్రతినిధి తలగాన నర్సింహమూర్తి, మండల కార్యదర్శి దువ్వాడ సంతోష్ కుమార్ నాయుడు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం వారు విలేకర్లతో మాట్లాడారు. 'కొంతమంది మీడియా ప్రతినిధులు వైసీపీ కార్యకర్తలు మాదిరిగా వ్యవహరిస్తూ శిరీషపై విష ప్రచారం చేస్తున్నారు. దీన్ని ప్రశ్నిస్తే మీడియాపై దాడులా? అంటు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. మా పార్టీ మీడియాతో మంచిగానే ఉంది. ఫేక్ పోస్టింగులు పట్టుకొని మా నాయకులపై ప్రచారం చేయడం తగదు. లక్ష్మీపురంలో ఓ ప్రధాన టీవీ విలేకరిపై వైసీపీ నాయకులు దౌర్జన్యానికి దిగారు. నిత్యం సీఎం నుంచి కిందిస్థాయి కార్యకర్త వరకు మూడు ప్రధాన మీడియా సంస్థలపై విషం చిమ్ముతున్నారు. ఇవేవీ మీకు కనిపించడం లేదా? ఒకరి వ్యక్తిగత కక్షలతో మా నాయకులపై బురదచల్లి మొత్తం మీడియాను అందులోకి లాగడం తప్పు.' అని తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు తిమడాన శంకర్, కుమార్‌రాజా పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగాలు టీడీపీతోనే సాధ్యం



హరిపురం: యువతకు విద్య, ఉద్యోగం, ఉపాధి అవకాశాలు ఒక్క టీడీపీతోనే సాధ్య మని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దాసరి తాతారావు అన్నారు. హరిపురంలోని పార్టీ కార్యాలయంలో క్లస్టర్, బూత్‌లెవెల్ ఏజెం ట్లు, ఇన్‌చార్జిలు, గ్రామ అధ్యక్ష, కార్యదర్శులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో కార్యకర్తలంతా ఒక్కతాటి పైకి వచ్చి కష్టపడి పనిచేయాలని సూచించారు. వైసీపీ ఆగడాలకు అడ్డుకట్ట వేసి ప్రభుత్వ వైఫల్యాలు, సూపర్ సిక్స్ పథకాలు, బీసీ డిక్లరేషన్‌ను ప్రజలకు వివరించాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, జీకే నాయుడు, ధనుంజయ, లబ్బ రుద్రయ్య, దున్న పురుషోత్తం పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు అవసరం

టెక్కలి: ఇళ్లలో గ్యాస్ సిలిండర్లతో వంట చేసే సమయంలో అగ్నిప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసు కోవాలని అగ్నిమాపక అధికారులు సూచించారు. చిన్ననారాయణపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో మహిళలకు అగ్నిప్రమాదాల నివారణపై అగ్నిమాపక అధికారి కె.మధుసూదనరావు సూచనలు చేశారు. గ్యాస్ లీకైతే ఎటువంటి చర్యలు చేపట్టాలో ప్రయోగాత్మకంగా చేపట్టి వివరించారు. విద్యా ర్థులు గ్రామంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్, పీవో కె.గొల్ల, డి.వాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలి

టెక్కలి: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని డివిజనల్ గణాంకాధికారి పీసీ నందా, డీపీ వాన శంకరరావు కోరారు. బుధవారం ఐతమ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. యువతీ యువకులు ఓటు హక్కు ఏ విధంగా వినియోగించుకోవాలని, ఈవీఎంపై అవగాహన కలిగించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ నాగే శ్వరరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, డీన్ విష్ణుమూర్తి, పీవో బలరాం, నోడల్ ఆఫీసర్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం

పలాసరూరల్: మామిడిపల్లి గ్రామ సంఘ భవనంలో గురువారం ఉదయం 10 గంటలకు అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పీవోడబ్ల్యూ జిల్లా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. కృష్ణవేణి, పి.కుసుమ తెలిపారు. ఈ మేరకు బుధవారం మాకన్నపల్లి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ప్రారంభం

ఎల్.ఎన్.పేట: మండలంలోని తురకపేట, బొత్తాడసింగి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను బుధవారం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆర్.జ్యోతిలక్ష్మి, తహసీల్దార్ రాణిఅమ్మాజీ, ఎంపీడీవో జి.గిరిబాల తదితరులు పాల్గొన్నారు. ● **పాతపట్నం:** రొమదళ గ్రామంలో ఇంటింటికీ కొళాయిలను ఎమ్మెల్యే రెడ్డి శాంతి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

జీడి మహా ధర్నాను జయప్రదం చేయండి

కాశీబుగ్గ: కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద మార్చి 11న జరుగు మహా ధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘాల నాయకులు కోనారి మోహన్‌రావు, అజయ్‌కుమార్, వేణుగోపాల్, రామారావు కోరారు. బుధవారం కాశీబుగ్గలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో వామపక్ష నాయకులు, రైతు సంఘాల జీడి రైతుల సమన్వయ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. ఉద్దాన ప్రాంతంలో జీడి పిక్కలు 80 కేజీలు బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించి, ఆర్బీకేల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని వైసీపీ ప్రభుత్వానికి కోరినా కనీసం స్పందించిన దాఖలాలు లేవని, రైతులు మాత్రం అనేక ఏళ్లుగా ఉద్యమాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 11న నిర్వహిస్తున్న మహా ధర్నాలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు మాధవరావు, గురయ్య, కాంతారావు, గణపతి, పురుషోత్తం, హేమాచలం, రాజారావు, తవిటయ్య తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నియంత్రణ కమిటీ ఏర్పాటు

పాతపట్నం: స్థానిక బ్రెడ్స్ స్వచ్ఛంద సేవాసంస్థ, కైలాశ్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పెద్దలోగిడి గ్రామంలో బాల్యవివాహాల నియంత్రణ కమిటీని నియమించారు. ఈ సందర్భంగా మండల కోఆర్డినేటర్ జి.జగన్నాథం మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించేలా చర్యలు తీసుకోవాల న్నారు. కార్యక్రమంలో పలువురు సభ్యులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ప్రతిష్ఠోత్సవాలు



సామూహిక పూజల్లో పాల్గొన్న మహిళలు

నందిగాం: నందిగాంలో పాతపట్నం అమ్మతల్లి(నీలమణిదుర్గ) గ్రామదేవత విగ్రహ పునః ప్రతిష్ఠోత్సవాలు బుధవారం శాస్త్రోక్తంగా సాగాయి. ఉదయం నుంచి రాత్రి వరకు విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు. విగ్రహానికి క్షీరాభిషేకం, ధాన్యాధివాసం, చండీ హోమం, కళాహోమాలు, విశేష ద్రవ్యాభిషేకాలు, పుష్పాధివాసం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం ప్రతిష్ఠతో పాటు అన్నప్రసాద వితరణ, రాత్రి ప్రముఖ కళా కారులచే సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటకం ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఐక్యతతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలి

వజ్రపుకొత్తూరు: ప్రజలు ఐక్యంగా ఉండి తమ గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఎస్ఐ సీహెచ్ రామా రావు సూచించారు. తనను ఎలాంటి కార్యక్రమాలకు పిలవకుండా కుల పెద్దలు అడ్డుకుంటున్నారని బైపల్లి గ్రామానికి చెందిన తామాడ కోదండరావు ఇటీవల పోలీసులు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్ఐ రామారావు, ఆర్ఐ పవిత్ర, సర్వేయర్ తిరుపతిరావు బుధవారం బైపల్లి పంచాయతీ కార్యాలయంలో కుల పెద్దలతో మాట్లాడారు. కుల సంఘాల్లో కొన్ని కట్టుబాట్లు ఉంటాయని, వాటిని ప్రతి ఒక్కరూ గౌరవించా లన్నారు. సంఘాల్లోని వ్యక్తులు పొరపాట్లు చేస్తే వారిని కులపెద్దలు మందలించి కలుపు కొనిపోవాలే గాని వారిని దూరం చేయకూడదన్నారు. కులసంఘాలు, గ్రామాభివృద్ధి సంఘాలు ఐక్యంగా ఉంటేనే గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొంటుందన్నారు. సమావేశంలో వీఆర్వో ఇందిర తదితరులు పాల్గొన్నారు.

శివసాగర్ బీచ్ అభివృద్ధికి చర్యలు



శివసాగర్ బీచ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని శివసాగర్ బీచ్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు పర్యాటకశాఖ డివిజనల్ మేనేజర్ హరిత తెలిపారు. బుధవారం బీచ్‌ను ఆమె సందర్శించారు. ఇప్పటికే సేకరించిన ఐదు ఎకరాల్లో ప్రైవేట్ భాగ స్వామ్యంతో అనేక నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నామని, టెండర్ ప్రక్రియ పూర్తయిందన్నారు. పర్యాటకులకు అనువైన విధంగా నిర్మాణాలు ఉంటాయన్నారు. రెస్టారెంట్, విశ్రాంతి భవనాలు, మరుగు దొడ్ల నిర్మాణాలు చేపడతామన్నారు. ఈ భూములు సీఆర్‌జెడ్ పరిధిలో ఉన్నప్పటికీ కొంతమంది రైతులు ఆక్రమించారని, వాటిని స్వాధీనం చేసుకోవాలని ఇప్పటికే రెవెన్యూ, పోలీసు అధికారులను కోరామన్నారు. కార్యక్రమంలో పర్యాటక మేనేజర్ నారాయణరావు, ఎస్ఐ రామారావు, ఆర్ఐ పవిత్ర, సర్వేయర్ తిరుపతి రావు, మాజీ సర్పంచ్ లండ రామలింగం తదితరులు పాల్గొన్నారు.

ధైర్యంగా 'పది' పరీక్షలు రాయండి: డీఈవో



నరసన్నపేట: విద్యార్థులకు సూచనలిస్తున్న డీఈవో వెంకటేశ్వరరావు

నరసన్నపేట: పదో తరగతి విద్యార్థులు ధైర్యంగా పరీక్షలు రాయాలని డీఈవో ఎ.వెంకటేశ్వరావు అన్నారు. బుధవారం స్థానిక బోర్డు ఉన్నత పాఠశాలను ఆయన పరిశీలించారు. పరీక్షల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఉపాధ్యాయులు పరీక్ష గదుల్లో ఏ విధంగా వ్యవహరించాలో తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు ఉండాలని ఆదేశించారు. లిప్ కార్యక్రమంపై సమీక్షించారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం రావాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి

జలుమూరు: విద్యార్థి దశ నుంచే ప్రణాళికాబద్ధంగా చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని హెచ్ఎం నక్క కోటిబాబు అన్నారు. పాగోడు ఉన్నత పాఠశాలలో బుధవారం 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. కష్టపడి చదివి ఒత్తిడికి లోను కాకుండా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీరామమూర్తి, జ్యోతి పాల్గొన్నారు.

ఇష్టపడి చదవాలి

దీర్ఘాశి(పోలాకి): విద్యార్థులు కష్టపడకుండా ఇష్టపడి చదవాలని పూర్వపు ఎంఈవో పాగోటి తవిటయ్య అన్నారు. బుధవారం దీర్ఘాశి ఉన్నత పాఠ శాల పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ప్రణాళికాబద్ధంగా పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. హెచ్ఎం ఎస్.శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ మెండ కృష్ణ సుమంగళి, మాజీ సర్పంచ్ సూరిబాబు, విద్యాకమిటీ చైర్‌పర్సన్ పల్లి ధనలక్ష్మి పాల్గొన్నారు.



పాగోడు, దీర్ఘాశి పాఠశాలల్లో డ్యాన్స్ చేస్తున్న బాలికలు

స్వయంభూ లింగేశ్వరుడి సన్నిధికి లిమ్కా బుక్స్ ప్రతినిధులు



పలాసరూరల్: మహాదేవపురంలోని స్వయంభూ లింగేశ్వరుడి సన్నిధికి ఈనెల 8న లిమ్కా బుక్స్ ప్రతినిధులు రానున్నట్లు నిర్వాహకులు చిన్నాచారి ఒక ప్రకటనలో తెలిపారు. పచ్చని, ఆహ్లాదకర వాతావరణంలో వెలసిన స్వయంభూ లింగేశ్వరుడు దేశంలోనే అత్యధిక ఎత్తులో ఉన్న శివలింగంగా పేరొందిందని, చుట్టూ కొండల మధ్యలో శివ లింగంతో ఎంతో ఆకట్టుకునేలా ఉండడంతో పర్యాటకులు వీక్షిం చేందుకు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఈ విషయం వివిధ మాధ్యమాల్లో ప్రచారం సాగడంతో లిమ్కాబుక్స్ ప్రతినిధులు శివరాత్రి నాడు ఆలయానికి వస్తున్నట్లు సమాచారం అందిందన్నారు.

వలంటీర్ వ్యవహార శైలిపై వృద్ధుల ఆందోళన

నందిగాం: పెద్దలవునిపల్లి పంచాయతీ చిన్నలవునిపల్లికి చెందిన వృద్ధ దంపతులు వలంటీర్ వ్యవహార శైలిపై ఆవేదన వ్యక్తంచేశారు. తమ ఆవేదనను సోషల్ మీడియా ద్వారా పాలు పంచుకోవడంతో అది బుధవారం వైరలైంది. వివరాలిలా ఉన్నాయి.. దట్టి ఎండమ్మ, కరువులు గ్రామంలో నివాసముంటున్నారు. అయితే వీరికి తాగునీరు అందక ఏడవడంతో సర్పంచ్ స్పందించి ట్యాప్‌లు ఏర్పాటు చేశారు. అయితే ట్యాప్ నుంచి నీరు రాకపోవడంతో 'ఇది ఎందుకు దండగ' అంటూ బాధపడి కొళాయిని నెట్టివేశారు. ఈ నేపథ్యంలో అక్కడి వలంటీర్ చంపేస్తాను.. తంతానంటూ భయభ్రాంతులకు గురి చేయడంతో మాకెవరు దిక్కని వాపోయారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి స్వాతిని వివరణ కోరగా వృద్ధ దంపతులను వలంటీర్ దుర్భాష ఆడలేదని, ట్యాప్ పాడు చేయడంతో అలా ఎందుకు చేశారని మందలించారన్నారు. సమస్యను పరిష్కరించి వారికి నీరు అందిం చేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని గ్రామోత్సవం

జలుమూరు: శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వరస్వామి గ్రామోత్సవం బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మాఘ బహుళ ఏకాదశిని పురస్కరించుకొని స్వామి వారికి ఉదయం పూజలు, అభిషేకాలు చేశారు. ఈవో పి.ప్రభాకరరావు, దేవాలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ మృతి


ముకుందరావు(ఫైల్)

శ్రీకాకుళంక్రైం/ ఆమదాలవలస: వంజంగి గ్రామ సమీపంలో లారీ ఢీకొని ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎచ్చెర్ల మండలం కుశాలపురం గ్రామానికి చెందిన ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ చింతాడ ముకుందరావు(57) ఆమదాలవలస రైల్వేస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. విధులు ముగించుకొని ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వస్తుండగా వంజంగి గ్రామం వద్ద లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ వాసు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై ఆరాతీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

'కానిస్టేబుల్‌ది ప్రభుత్వ హత్యే'

ఆమదాలవలస: శ్రీకాకుళం-ఆమదాలవలస రహ దారిలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్ర మాదంలో మృతి చెందిన ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ చింతాడ ముకుందరావుది ప్రభుత్వ హత్యగా ఆమదాలవలస నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ పేడాడ సూరపునాయుడు ఆరోపిస్తున్నారు. బుధవారం ఆయన విలేకరులతో మా ట్లాడుతూ.. ప్రజలు ఎన్నుకొనే ప్రభుత్వాలు, ప్రజల ప్రాణాలకు ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

శ్రీకాకుళం క్రైం: సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రకటనలు నమ్మి ప్రజలు ఎక్కువగా మోసపోతున్నారని, సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రాధిక బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొందరు నేరస్థులు నేరుగా మీ నెంబరుకు ఫోన్ చేసి మీరు కొరియర్ రూపంగా డ్రగ్స్ బుక్ చేశారని, లేదంటే మీ చిరునామాకు మాదకద్రవ్యాలు వచ్చాయని తాము ముంబాయి, ఢిల్లీ, నార్కోటిక్స్ పోలీసులమంటూ వీడియో కాల్ చేస్తుంటారు.. మీపై కేసు లేకుండా చేస్తామంటూ డబ్బులు డిమాండ్ చేస్తుంటారని ఇలాంటి ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని, అలాంటి వారి వివరాలు మీ సమీపంలోని పోలీసులకు తెలియజేయాలని ఎస్పీ సూచించారు. ఆన్‌లైన్ జాబ్స్ పేరిట ఉద్యోగపు ఆశ చూపే మోసగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని వారిని నమ్మి మీ వ్యక్తిగత వివరాలు ఎవరితో కూడా షేర్ చేయకుండా చూసుకోవాలన్నారు. పార్ట్ టైం జాబ్స్ పేరిట వచ్చే లింక్స్‌ను క్లిక్ చేసి మోసపోవద్దన్నారు. తక్కువ పెట్టుబడులతో అధిక లాభాలు వస్తాయని ఆశ చూపే వారిని నమ్మొద్దని ఎస్పీ వివరించారు. ఇంటర్నెట్, గూగుల్ వంటి వాటిలో ఏదైనా ఆన్‌లైన్ ఫిర్యాదు చేద్దామని కంపెనీ పేర్లు, కస్టమర్ కేర్ నెంబర్స్‌ను వెతికే క్రమంలో మోసగాళ్ల ఫోన్ నెంబర్లను నిజమైనవిగా భావించి, ఆ మోసగాళ్లకు మీరు ఫోన్ చేసి మీ వ్యక్తిగత వివరాలు చెప్పడం వల్ల వారు మీ ఫోన్‌ను హ్యాక్ చేసి గోప్య సమాచారాన్ని, ఫొటోలను దొంగిలించి బ్లాక్‌మెయిల్ చేసే నగదు డిమాండ్ చేసే ప్రమాదముందని హెచ్చరించారు. గుర్తుతెలియని అపరిచిత నెంబర్ల నుంచి వచ్చే మెస్సేజ్‌లను, లింకులను క్లిక్ చెయొద్దని ఎస్పీ రాధిక వివరించారు.

1930 ఫిర్యాదు చేయండి

ఇటువంటి మోసాలకు గురైనప్పుడు తక్షణం సైబర్ హెల్ప్‌లైన్ నెంబరు 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చెయాలని ఎస్పీ రాధిక సూచించారు. సైబర్ పోలీసులు వెంటనే ప్రజల ఫిర్యాదును తీసుకుని మోసగాళ్లను పట్టుకునే చర్యలు చేపడతారన్నారు. అలాగే పోయిన నగదును కూడా రికవరీ చేసే అవకాశం ఉందని తెలిపారు. 1930కి చేలేకపోతే సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. సైబర్‌క్రైం.జీవోవీ.ఇన్‌లో ఫిర్యాదు చేయాలని స్పష్టం చేశారు.

రొట్టవలసలో శ్రీరామ దీక్షలు

సరుబుజ్జిలి: రొట్టవలస గ్రామంలోని శ్రీరామానందా శ్రమంలో బుధవారం భక్తులు శ్రీరామదీక్షలు చేపట్టారు. ఆశ్రమ గురుస్వామి తొత్తడి వెంకటరమణ ఆధ్వర్యంలో దీక్ష చేపట్టిన భక్తులకు మాలలు వేసి ఆశ్రమంలో పూజ లు నిర్వహించారు. రొట్టవలస, అవతరబాద్, కొండవలస, షలంత్రి, కొత్తకోట గ్రామాలకు చెందిన భక్తులు దీక్ష చేపట్టి శ్రీరామనవమికి భద్రాచలంలో దీక్ష విరమిస్తారన్నారు.

అమరావతిలో 'మన కలిశెట్టి ఎచ్చెర్ల భవన్' ప్రారంభం


భవనాన్ని ప్రారంభిస్తున్న కలిశెట్టి

ఎచ్చెర్ల: అమరావతిలో 'మన కలిశెట్టి ఎచ్చెర్ల భవన్'ను పొందూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, టీడీపీ నాయ కులు కలిశెట్టి అప్పలనాయుడు బుధవారం ప్రారంభించారు. వివిధ పనుల నిమిత్తం ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి రాష్ట్ర రాజధాని అమరా వతికి వెళ్లే ప్రజల సౌలభ్యం కోసం ఈ భవన్‌ను ఏర్పాట్లు చేసినట్టు కలిశెట్టి వివరించారు. ఇలా వచ్చేవారికి భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తామని.. ప్రజల కోసమే అధునాతన భవనాన్ని సిద్ధం చేశామని చెప్పారు. విజయవాడలో దిగినవారికి ఆటో సౌకర్యం కల్పించామని.. వంద మంది వరకూ సరిపడేలా 24 గంటలు అందుబాటులో ఈ భవన్ ఉంటుందని స్పష్టంచేశారు. విజయవాడలో రామవరప్పాడు రింగ్‌రోడ్డు వద్ద, రోయల్ సర్వీస్ అపార్ట్‌మెంట్ హస్టల్స్, మోకా రెసిడెన్సీ చిన్మయి ధ్యాన మందిర్ పక్కన, కరెన్సీనగర్‌లో 'మన కలిశెట్టి ఎచ్చెర్ల భవన్' చిరునామా అని వివరించారు.

అలరించిన ఫ్లాష్ మాబ్


డ్యాన్స్‌తో అలరిస్తున్న విద్యార్థులు

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన టెక్ ఫెస్ట్ బుధవారంతో ముగిసింది. వైబ్రేంట్ విస్టా 2కె24 పేరిట నిర్వహించిన టెక్ ఫెస్ట్‌లో ఇంజనీరింగ్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు ఫ్లాష్ మాబ్ డ్యాన్స్‌లతో అలరించారు. వీసీ కేఆర్ రజని విద్యార్థుల నృత్యాలను తిలకించి అభినందించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రాజశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్త వీరంగం

- నీటి కోసం వెళ్లిన మహిళలతో అసభ్యప్రవర్తన
- న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించిన బాధితులు
- దళితుడు, విలేకరిపై ఎస్ఐ దౌర్జన్యం


పోలీసు స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న రాజమ్మకాలనీ మహిళలు

పలాస, మార్చి 6: మునిసిపాల్టీలోని 29వ వార్డు రాజమ్మకాలనీలో వైసీపీ కార్యకర్త వీరంగం సృష్టించాడు. తాగునీటి కోసం బోరు (చేతిపంపు) వద్దకు వెళ్లిన మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో తమకు న్యాయం చేయాలని బాధితులు పోలీసు స్టేషన్ ఎదుట బైఠాయించారు. వారికి సంఘీభావం తెలిపిన ఓ దళితుడిపై ఎస్ఐ దురుసుగా ప్రవర్తించారు. దీన్ని కెమెరాలో చిత్రీకరిస్తున్న ఓ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరి పైనా ఎస్ఐ దాడికి యత్నించారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత జరిగిన ఘటన పట్టణంలో తీవ్ర సంచలనం కలిగించింది. రాజమ్మకాలనీలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. ఉదయం వేళలో నీరు దొరకని పరిస్థితి నెలకొంది. దీంతో ఆ కాలనీ మహిళలు రాత్రి వేళల్లో బోరు వద్దకు వెళ్లి నీటిని పట్టుకుంటుంటారు. ఇదే విధం గా మంగళవారం రాత్రి 11గంటల సమయంలో మహిళలు బోరు వద్దకు వెళ్లి నీటిని పట్టుకుంటుండగా అదే ప్రాంతంలో ఉన్న వైసీపీ కార్యకర్త వారితో దురుసుగా ప్రవర్తించాడు. ఇదేంటని మహిళలు ప్రశ్నించడంతో బూతు పురాణాన్ని అందుకున్నాడు. దీంతో అర్ధరాత్రి దాటిన తరువాత వారంతా కాశీబుగ్గ పోలీసులను ఆశ్రయించారు. అయితే పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో మహిళలంతా పోలీస్‌స్టేషన్ వద్ద బైఠా యించి నిరసన వ్యక్తం చేశారు. అక్కడే మఫ్టీలో ఉన్న ఎస్ఐ వారిని ఇక్కడ నుంచి వెళ్లిపోవాలని ఆదేశించారు. మహిళలకు సంఘీభావంగా వచ్చిన దళితుడు రాజారావుపై ఎస్ఐ దురుసుగా వ్యవహరించడంతో పాటు భుజం పట్టి తోసేశారు. మహిళలు అక్కడే ఉన్నా పత్రికల్లో రాయని భాషలో దుర్భాషలాడారు. ఈ వ్యవహారాన్ని కెమెరాలో రికార్డు చేస్తున్న ఓ టీవీ చానల్ విలేకరి ఎన్.మోహనరావుపైకి ఎస్ఐ దూసుకు వచ్చారు. కెమెరాను లాక్కునే ప్రయత్నం చేయడంతో మహిళలు ఎస్ఐ తీరుపై ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం పోలీసులు వైసీపీ కార్యకర్తను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. దీంతో మహిళలు శాంతించారు. అయితే విలేకరిపై ఎస్ఐ దౌర్జన్యం చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనికి సంబంధించిన వీడియో ఫుటేజిలను ఎస్పీ కార్యాలయానికి విలేకరులు పంపించారు.

టీడీపీకి బీసీలే వెన్నెముక

అరసవల్లి: తెలుగుదేశం పార్టీకి బీసీలే వెన్నెముక అని, పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలు పార్టీకి అండగా నిలుస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, శ్రీకాకుళం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గుండ లక్ష్మీదేవి అన్నారు. బుధవారం స్థానిక ఏడురోడ్ల కూడలి వద్ద జయహో బీసీ విజయోత్సవ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులతో కలిసి నిర్వహించారు. తొలుత పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్‌తోపాటు కింజరాపు ఎర్రన్నాయుడు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి మాట్లాడుతూ.. జయహో బీసీ సభలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌పై ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక స్థానిక సంస్థలో బీసీల ప్రాతినిధ్యాన్ని 24 శాతానికి తగ్గించారని, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే దానిని 34 శాతానికి పెంచడం జరుగుతుందన్నారు. బీసీల అభివృద్ధితో రాష్ట్రాభివృద్ధి ముడిపడి ఉందన్నారు. కార్యక్రమంలో నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, సింతు సుధాకర్, కోరాడ హరగోపాల్, ముద్దాడ కృష్ణమూర్తినాయుడు, కొమ్మనాపల్లి వెంకట రామరాజు, బుక్కా యుగందర్, కవ్వాడి సుశీల, పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైభవంగా ఆదిత్యుని కల్యాణం



అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారికి మాఘ బహుళ ఏకాదశి (మతత్రయ)ని పురస్కరించుకుని బుధవారం వైభవంగా కల్యాణం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఆలయ అనివెట్టి మండపంలో స్వామివారికి వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు నడుమ వైభవంగా నిర్వహించామని ఆలయ ఈవో రమేష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో దర్భముళ్ల శ్రీనివాసశర్మ, ఇప్పిలి సాందీపశర్మ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డు హోమ్‌గార్డుకు చెక్కు అందజేత

శ్రీకాకుళం క్రైం: పోలీసు శాఖలో హోంగార్డుగా విధులు నిర్వహించి ఈ ఏడాది జనవరిలో ఉద్యోగ విరమణ చేసిన కొవ్వూరు అప్పారావుకు బుధవారం ఎస్పీ జీఆర్ రాధిక నగదు చెక్కును అందజేశారు. హోంగార్డు సహోద్యోగుల ఒక్క రోజు జీతం రూ.4.22 లక్షలు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అందించారు. కార్యక్రమంలో ఎస్పీతో పాటు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ డి.సురేష్ తదితరులు ఉన్నారు.

ఏవోగా బాధ్యతల స్వీకరణ


ఏవోగా బాధ్యతలు చేపట్టిన బాబూరావు

శ్రీకాకుళం అర్బన్: డీఎంహెచ్‌వో కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి(ఏవో)గా రాయి బాబూరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇన్‌చార్జి ఏవోగా బాధ్యతలు నిర్వహించిన పి.వెంకటరమణ స్థానంలో బాబూరావు నియమితులయ్యారు. బాబూరావు గతంలో రిమ్స్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించారు. పదోన్నతిపై డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏవోగా బాబూరావు బాధ్యతలు చేపట్టారు. కాగా ఇదే కార్యాలయంలో ఆయన సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవోను పలువురు ఉద్యోగులు అభినందించారు.

హక్కులపై అవగాహన ఉండాలి

జి.సిగడాం: బాలికలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో వెంకన్నబాబు అన్నారు. బుధవారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలురుతో సమానంగా బాలికలకు సమాన హక్కులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి ఉషారత్నకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజని, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రిడాయ్ ఎక్స్‌పో


మాట్లాడుతున్న చక్రవర్తి

శ్రీకాకుళం అర్బన్: ఈ నెల 8నుంచి 10వ తేదీ వరకు నగరంలోని ఆనందమయి ఫంక్షన్ హాల్‌లో క్రిడాయ్ మెగా ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్టు ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు పి.రమేష్ చక్రవర్తి తెలిపారు. బుధవారం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దాదాపు 50 స్టాళ్లలో కస్టమర్లకు వారి ఆర్థిక స్తోమతను బట్టి ప్రాపర్టీ షోలో సరైన నిర్ణయం తీసుకుని పెట్టుబడులు పెట్టేందుకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకుని సొంతింటి కలను సాకారం చేసుకోవాలని కోరారు. సమావేశంలో సంస్థ ఉపాధ్యక్షుడు దుంగ సుధాకర్, కార్యదర్శి ఆదీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటు వేద్దాం.. దేశాన్ని ముందుకు నడిపిద్దాం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ప్రతీ పౌరుడు ఓటు వేసి దేశాన్ని ముందుకు నడిపించాలని నర్సింగ్ కళాశాల ప్రోగ్రాం అధికారిణి కె.పద్మావతి పిలుపునిచ్చారు. రిమ్స్ ఆవరణలో ఉన్న నర్సింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు బుధవారం ప్రోగ్రాం ఆఫీసర్, లెక్చరర్ కె.పద్మావతి, ఏపీవో పి.సునీల్, ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ ఎస్.కళావతమ్మ ఆధ్వర్యంలో మేరా పెహలా ఓటు దేశ్ కేలియే (నా మొదటి ఓటు దేశానికే) అంటూ డే అండ్ నైట్ వరకు ర్యాలీగా వెళ్లి మానవహారం చేపట్టారు. ప్రొఫెసర్స్ ఎం.మిచెల్, ఉషా, లెక్చరర్స్ హరిప్రియ, పుష్పలత, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

గోకర్ణపల్లిలో పోలీసుల మాక్‌డ్రిల్

పొందూరు: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పోలీసులు మక్ డ్రిల్ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు బుధవారం ఎస్ఐ వై.రవికుమార్ ఆధ్వర్యంలో సుమారు 100 మంది పోలీసులు గోకర్ణపల్లి గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు.

కబడ్డీలో జిల్లాకు తృతీయస్థానం


రాష్ట్రస్థాయి కబడ్డీలో తృతీయస్థానం సాధించిన జిల్లా జట్టు

శ్రీకాకుళం స్పోర్ట్స్: విశాఖపట్నంలో గత మూడు రోజుల నుంచి జరిగిన 70వ పురుషుల అంతర్ జిల్లాల సీనియర్ కబడ్డీ టోర్నమెంట్‌లో శ్రీకాకుళం జిల్లా తృతీయస్థానం సాధించింది. రా ష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటిన జిల్లా క్రీడాకారులకు రాష్ట్ర జట్టులో స్థానం కల్పించారు. ఇందులో ఎస్.సెంగలరావు(సింగుపురం), ఎన్.మణికంఠ (పాలకొండ) ఉన్నారు. వీరిద్దరు నెలాఖరులో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారు. క్రీడాకారుల ప్రతిభ పట్ల జిల్లా కబడ్డీ సంఘం కార్యదర్శి సాధు శ్రీనివాసరావు, అధ్యక్షులు డి.రామలింగంనాయుడు, పీఈటీ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎంవీ రమణ, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, మునలినాయుడు తదితరులు అభినందించారు.

ప్రభుత్వ శాఖల సమన్వయంతో అభివృద్ధి

గుజరాతీపేట: ప్రభుత్వ శాఖల సమన్వయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలను జిల్లాలో చేపట్టడం జరుగుతుందని నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి వరప్రసాద్ అన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాలలో బుధవారం వివిధ బ్యాంకులు, స్వచ్ఛంద సంస్థలు, రైతు ఉత్పత్తిదారుల కంపెనీల సభ్యులతో సమన్వయ సమావేశం జరిగింది. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ ఉప సంచాలకులు త్రినాథస్వామి, లీడ్ బ్యాంక్ మేనేజర్ సూర్యకిరణ్, డీసీసీబీ ఏజీఎం రామకృష్ణారావు, ఉమామహేశ్వరరావు, ఎం.నాగలక్ష్మి, సాంబమూర్తి, సన్యాసిరావు, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో పొరపాట్లకు తావులేకుండా చర్యలు


మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్: జిల్లాలో పారదర్శక అనుబంధ (సప్లిమెంట్) ఓటర్ల జాబితాల రూపకల్పనలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అన్నారు. అనుబంధ ఓటర్ల జాబితాల్లో మార్పులు, చేర్పులు, రానున్న 2024 ఎన్నికల సన్నద్ధతపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జేసీ ఎం.నవీన్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గడచిన వారం రోజుల్లో 2099 మంది మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో, మీడియా ప్రతినిధులతో గురువారం జడ్పీ సమావేశ మందిరంలో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆయా పార్టీల నుంచి ఒక్కొక్క ప్రతినిధి హాజరయ్యేలా చూడాలని కోరారు. సమావేశంలో సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఆర్వో ఎం.గణపతిరావు, పీఎంజే బాబు (టీడీపీ), రౌతు శంకరరావు(వైసీపీ) సురేష్ సింగ్ బాబు(బీజేపీ), మల్లిబాబు (కాంగ్రెస్), ఎల్.సోమేశ్వరరావు (బీఎస్పీ), సీ-సెక్షన్ సూపరింటెండెంట్ కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుజరాతీపేట: ఏపీ గురుకుల విద్యాలయాల్లో 5, 6, 7, 8వ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవల్సిందిగా వమరవల్లి గురుకుల విద్యాలయం హెచ్‌ఎం వై.చిట్టితల్లి ప్రక టనలో తెలియజేశారు. ఆంగ్లమాధ్యమంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి ఆర్.నరసింహారావు తెలిపారు. ఈ నెలాఖరులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

- **పొందూరు:** విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రవేట్, కార్పొరేటు పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు కల్పించనున్న ఉచిత ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్ఎస్ఏ కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి పేడాడ ప్రభాకరరావు తెలిపారు. మండల కేంద్రం, ఎంఆర్‌సీలో బుధవారం ఎంఈవో పి.రాజారావుతో కలిసి విలేఖరులతో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 25 శాతం సీట్లు పేదలకు కేటాయించడం జరుగుతుందన్నారు. ఐదేళ్లు నిండిన పిల్లలకు 1వ తరగతిలో రిజర్వేషన్ ప్రాతిపదికన ప్రవేశాలు కల్పిస్తామన్నారు.

'సామాజిక న్యాయంపై చర్చకు సిద్ధం'

శ్రీకాకుళం అర్బన్: బీసీలకు వైసీపీ అందించిన సామాజిక న్యాయంపై తాను చర్చకు సిద్ధమని, ఇందుకు చంద్రబాబు వచ్చినా.. అతని ప్రతినిధులు వచ్చినా సరేనని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు సవాల్ విసిరారు. స్థానిక టౌన్ హాల్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీలకు చంద్రబాబు హయాంలో సామాజిక న్యాయం జరగలేదని, బాబు ఏనాడు బీసీలకు రాజ్యాధికారం ఇవ్వలేదన్నారు. ఎన్నికల ముందు మాయ మాటలు చెప్పి బీసీలను వాడుకోవడం తప్ప చంద్రబాబు చేసిందేమీ ఉండదన్నారు. బీసీ గర్జన పేరుతో చంద్రబాబు చెప్పే మాయ మాటలు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు.

ముగిసిన టెట్

ఎచ్చెర్ల: ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (ఏపీ టెట్) బుధవారంతో ముగిసాయి. మండలంలో రెండు కేంద్రాల్లో గత నెల 27 నుంచి ఆన్‌లైన్‌లో ఈ పరీక్షలు జరిగియి. బుధవారం శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో 200కు 180 మంది, శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల)లో 200కు 188 మంది హాజరయ్యారు. మొత్తం ఎనిమిది రోజుల పాటు జరిగిన ఈ పరీక్షలు రెండు కేంద్రాల్లో మొత్తం 3,219 మందికి 3,047 మంది హాజరయ్యారు.

ప్రమాదాలపై అవగాహన

అరసవల్లి: పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగే సమయంలో అప్రమత్తతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మాక్‌డ్రిల్ ఏర్పాటు చేస్తున్నట్టు డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ బి.రాంబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాక్ డ్రిల్ ఎచ్చెర్ల మండలం పొన్నాడ గ్రామంలో మార్చి 7వ తేదీన ఉదయం 9 గంటలకు స్మార్ట్‌కెం టెక్నాలజీస్ సహాయంతో నిర్వహిస్తామన్నారు.

తూతూ మంత్రంగా మండల సర్వసభ్య సమావేశం

జి.సిగడాం: స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఎంపీపీ మీసాల సత్యవతి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా జరిగింది. పదిన్నర గంటలకు నిర్వహించాల్సిన సమావేశం 11 గంటలకు ప్రారంభించినా 16 మంది ఎంపీటీసీ సభ్యులకు గాను ఏడుగురు ఎంపీటీసీ, ఒక కో-ఆప్షన్ సభ్యుడు మాత్రమే హాజరయ్యారు. అలాగే మండల స్థాయి అధికారులు ఒకరిద్దరు తప్పా ఎవరూ హాజరుకాలేదు. కలెక్టర్‌తో సమావేశం ఉన్నందున అధికారులు హాజరుకాలేదని ఎంపీపీ తెలిపారు. దీంతో వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ వద్ద ఉన్న నివేదికలను చదివి వినిపించి మమా అనిపించేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కాయల రమణ, మండల ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, ఎంపీడీవో వెంకన్నబాబు, తహసీల్దార్ ఉమామహేశ్వరరావు, ఏపీవో సత్యన్నారాయణ, ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు, ఏఈ తిరుపతిరావు, పశువైద్యాధికారి సుమన్, వైద్యాధికారులు అనూష సుమబిందు పాల్గొన్నారు.

ముమ్మరంగా ప్రారంభోత్సవాలు

సరుబుజ్జిలి: ఎన్నికల వేళ సమీపిస్తుండడంతో స్పీకర్ తమ్మినేని సీతారాం వివిధ అభివృద్ధి పనులకు ముమ్మరంగా ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. బుధవారం తెలికిపెంట గ్రామ పంచాయతీ పాతపాడు గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్రం, ఇంటింటి కొళాయి పథకాన్ని ప్రారంభించారు. యరగాం, లొద్దల కాగితాపల్లి, వీరభద్రాపురం గ్రామాల్లో ఇంటింటా కొళాయిలను ప్రారంభించారు. విజయరాంపురంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య ఉప కేంద్రాలతో పాటు చిగురువలస గ్రామ సచివాలయ పరిధిలోని రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రత్నం, వైసీపీ నాయకులు కేవీజే సత్యనారాయణ, బెవర కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా


వృథాగా పోతున్న తాగునీరు

గార: మండలంలోనే అతిపెద్ద మత్స్యకా రుల గ్రామ మైన బందరువానిపేటలో ప్రజల దాహార్తి తీర్చే తాగునీటి ప థకం పైపు జాయింట్ వద్ద లీకైపోయి నీరు గత రెండు రోజులుగా వృథా గా పోతోందని స్థానికులు వాపోతున్నారు. వంతెన దగ్గర ఇలా పైపు జాయింట్ వద్ద వృథాగా పోతున్న నీటి ని అరికట్టే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతు న్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.వెంకటేష్ వద్ద ప్రస్తావించగా పంచాయతీ సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని నీటి వృథాను అరికట్టే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

గార: కొర్ని, కె.మత్స్యలేశం, సతివాడ, రామచంద్రాపురం తదితర పంచాయతీల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని సభ్యులు పీసా గోపి, బుద్దా లలిత, పి.శ్రీరాములు, జీవీ రమణమూర్తి తదితరులు కోరారు. బుధవారం ఎంపీపీ గొండు రఘురామ్ అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో వారు పాల్గొని ఈ విషయాన్ని సభ దృష్టికి తీసుకువచ్చారు. వాడాడ సచివాలయంలో పూర్తి స్థాయి సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని సర్పంచ్ సుంకాన సురేష్ సభ దృష్టికి తీసుకువచ్చారు. కె.మత్స్యలేశంలో జగనన్న కాలనీలో విద్యుత్ కనక్షన్‌లు ఇవ్వలేదని సర్పంచ్ లలిత అన్నారు. జొన్నలపాడులో పాఠశాల భవనం శిథిలావస్థలో చేరుకుందని ఎంపీటీసీ రుప్ప శ్రీనివాస్ అన్నారు. శాలిహుండం సచివాలయ భవనం, ఆర్‌బీకే భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండిపోయాయని సర్పంచ్ కె.ఆదినారాయణ అన్నారు. సమావేశంలో ఎంపీడీవో బి.కల్యాణి, తహసీల్దార్ శ్రీను, ఏఈ చక్రధరరావు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ఇచ్ఛాపురం: హెచ్ఐవీ బాధితుల పట్ల అప్రమత్తంగా ఉండడంతో పాటు సకాలంలో వారికి మందులు అందేటట్లు చూడాలని ఐసీటీసీ స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ వైద్యులకు సూచించారు. బుధవారం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఉన్న ఐసీటీసీ సెంటర్‌ను సందర్శించారు. రికార్డులు పరిశీలించిన కోఆర్డినేటర్ మాట్లాడుతూ.. గర్భిణులకు తప్పనిసరిగా ప్రత్యేకంగా హెచ్ఐవీ టెస్ట్ చేయాలని, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు, చంటి పిల్లలకు హెచ్ఐవీ టెస్ట్‌లు చేయించాలన్నారు. హెచ్ఐవీ పేషెంట్లకు ఇచ్ఛాపురంలోనే మందులు అందిలా చూడాలని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ పి.దేవేంద్రరెడ్డి కోరారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

ఆమదాలవలస: విద్యార్థులు క్రమశిక్షణతో, ప్రణాళికాబద్ధంగా చదివితే పరీక్షల్లో మంచి మార్కులు సాధించవచ్చని జడ్పీటీసీ బెండి గోవిందరావు అన్నారు. తొగరాం జడ్పీ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గత విద్యా సంవత్సరంలో టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. టెన్త్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు కిట్లు అందించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఉద్దానంలో కోనసీమ కొబ్బరి

- దిగుమతిని అడుకున్న వరక గ్రామస్థులు
- ప్రభుత్వ నిర్లక్ష్యంపై రైతుల మండిపాటు


వ్యాపారిని ప్రశ్నిస్తున్న రైతులు

కవిటి: ఉద్దానం ప్రాంతంలో కోనసీమ నుంచి కొబ్బరి కాయలు తీసుకువచ్చి అమ్మకాలు సాగిస్తున్న వ్యాపారులపై ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు, గ్రామస్థులు స్పందించిన ఘటన ఇది. కవిటి మండలం వరక గ్రామంలో హోల్‌సేల్ కొబ్బరి వ్యాపారి తన వ్యాపారాన్ని సాగించుకునేందుకు కోనసీమ కొబ్బరి కాయలను కొనుగోలు చేసి తీసుకువచ్చారు. ఇవి నాణ్యతలో తక్కువగా ఉన్నా ఉద్దానం కాయలుగా చెప్పి వ్యాపారాలు సాగించటం ఇక్కడి వ్యాపారుల వంతుగా మారింది. ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు నాణ్యత, పరిమాణంలో ఉద్దానం ప్రాంత కాయలకు ప్రత్యేకత ఉంది. దీంతో ధర కూడా అధికంగా ఉంటుంది. దీన్ని అవకాశంగా చేసుకొని వ్యాపారులు, కొందరు దళారులు ఈ ప్రాంతంలో కోనసీమ కాయలను దిగుమతి చేసుకొని వ్యాపారాన్ని సాగిస్తున్నారు. కొన్నేళ్లుగా ఈ వ్యాపారం సక్రమంగా సాగుతుండడంతో ఎవరూ పట్టించుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వం అయితే కొబ్బరి రైతులను పట్టించుకున్న పాపాన లేదు. ప్రస్తుతం ఉద్దానంలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో కొబ్బరి చెట్లు నుంచి దిగుమతి తగ్గిం ది. ధర కొంచెం మెరుగ్గా ఉన్నా రైతులకు అందే పాపాన లేదు. దానిని అవకాశంగా మార్చుకొని వ్యాపారులు, దళారు లు తమ వ్యాపారాన్ని సాగించుకునేందుకు కోనసీమ కొబ్బరి కాయలపై దృష్టి సారించారు. కోనసీమలో కొబ్బరి ధర వెయ్యి కాయలు రూ.10 వేల నుంచి రూ.12 వేలకు లభ్యం కావడం తో వ్యాపారులు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తు తం ఉద్దానం ప్రాంతంలో కాయలు ధర రూ.19 వేలు నుంచి రూ.21వేలు వరకు పలుకుతుండడంతో వ్యాపారులు ఈ వ్యాపారాన్ని నిరాటంకంగా సాగిస్తున్నారు. కోనసీమ నుంచి తీసుకువచ్చి ఉద్దానం కాయలు అని చెప్పి ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు చేస్తున్నారు. ఇదే పరిస్థితిలో కవిటి మండలంలోని వరక గ్రామంలో ఓ వ్యాపారి కోనసీమ నుంచి కాయలను మంగళవారం దిగుమతి చేసుకొని కొబ్బరితోటలో నిల్వచేశారు. ఎప్పటిలాగే బుధవారం వాటిని కార్మికులతో తొక్క తీయించి అమ్మకాలు చేసేందుకు ప్రయత్నించారు. ఉద్దానంలో కాయలు లభ్యత లేని స్థితిలో నిల్వలు గమనించిన రైతులు, గ్రామస్థులు బుధవారం వ్యాపారిని ప్రశ్నించారు. కార్మికులను నిలుపుదల చేయించి వ్యాపారితో వాగ్వాదం చేశారు. ఇలా దిగుమతి చేసుకొని అమ్మకాలు చేయడంతో ఉద్దానం కొబ్బరి కాయల ఉనికికి ప్రమాదం ఏర్పడుతుందని శ్రీకాంత్ పురియా, బి.రాజేంద్రం, జగదీష్ పురియా, బి.జగదీష్ తదితర రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇలా అమ్మకాలు సాగించడానికి వీలులేదన్నారు. మండలంలోని కొందరు నేతలు, రైతు సంఘాలకు సమాచారాన్ని అందించి అమ్మకాలు అడ్డుకున్నారు. దీంతో ఆ వ్యాపారి చేసేది ఏమి లేదని ఇకపై బయట ప్రాంతాల నుంచి కాయలు తీసుకువచ్చి అమ్మకాలు సాగించనని చెప్పడంతో వారంతా శాంతించారు.